క్లుప్తంగా

మురుగు కాలువల్లో పూడిక తొలగింపు



పొదలకూరు : పట్టణంలోని ఎమ్మార్వో కాలనీలో దోమల ఉధృతిని తగ్గించేందుకు పంచాయతీ నిర్వాహకులు మురుగు కాలువల్లో పూడిక, చెత్తాచెదారాన్ని సోమవారం తొలగించారు. వార్డు సభ్యులు హరి, భాస్కర్ పర్యవేక్షణలో పారిశుద్ధ్య సిబ్బంది మురుగు కాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ చేపట్టి మురుగు కాలువలను శుభ్రం చేయిస్తున్నామని, ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

బీమా సాయం అందజేత



మనుబోలు : మనుబోలు సీఎం నగర్‌లో మూడు రోజుల క్రితం అనారోగ్యంతో పాముల ప్రసాద్ మరణించగా, అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా ద్వారా అందిన ఆర్థిక సాయాన్ని సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుటుంబసభ్యులను పార్టీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం బీమా ద్వారా అందిన తక్షణ సాయం రూ.10 వేల నగదును ప్రసాద్ భార్య శ్రావణికి అందజేశారు. మిగిలిన బీమా మొత్తం బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు అనమాల ప్రభాకర్‌రెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, కేవీఆర్ గౌడ్, దాసరి మహేంద్ర వర్మ, వలంటీర్ గిరి ఉన్నారు.

ఉక్కు మనిషికి ఘన నివాళి



బెలూన్‌పై వల్లభ్ భాయి పటేల్ చిత్రం

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీ సుబ్బారెడ్డిపాళెం యూపీసూ్కల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం బెలూన్‌పై సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ చిత్రాన్ని సోమవారం రూపొందించారు. ఈనెల 31వ తేదీన జాతీయ సమైక్యత దినోత్సవం(ఏక్తాదివస్), 'ఉక్కు మనిషి' జయంతి సందర్భంగా ఈ చిత్రాన్ని ఆవిష్కరించి, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

విడవలూరులో సెంట్రల్ సర్వే టీమ్

విడవలూరు : విడవలూరులోని తహసీల్దార్ కార్యాలయాన్ని చెన్నై నుంచి వచ్చిన సెంట్రల్ రెవెన్యూ సర్వే (ల్యాండ్) డిపార్ట్‌మెంట్ వారు ఆదివారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో భాగంగా మండలంలోని సర్వేయర్లు ఉపయోగిస్తున్న అత్యాధునిక డ్రోన్లు, స్టోన్లు, ఫైనల్ రికార్డ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఎమ్.వెంకటేషన్, అసిస్టెంట్ డైరెక్టర్ జి.మోహన్, డీఎల్‌ఆర్‌ఎంపీ మేనేజర్ ఎస్.మనివన్నన్, వేలూరు టౌన్ ఇన్‌స్పెక్టర్ శరవణన్, తిరువళ్లూరు సబ్ ఇన్‌స్పెక్టర్ రావన్, సర్వేయర్ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

నెల్లూరు(దర్గామిట్ట): కావలిలో ఆర్టీసీ డ్రైవర్ బీ రాంసింగ్‌పై అనాగరికంగా దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఎస్పీ కొందరు నిందితులను అరెస్ట్ చేశారని, దాడి ఘటనపై వాస్తవాలను పరిశీలించి దాడికి పాల్పడిన దుండగులు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా అరెస్ట్ చేసి తగు శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఏపీజేఏసీ అమరావతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ పెంచలరెడ్డి, ఓవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మప్రచార వారోత్సవాలకు టెండర్ల ఖరారు

నెల్లూరు రూరల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న ధర్మ ప్రచార వారోత్సవాలకు సీల్డ్ టెండర్లను సోమవారం తెరిచారు. తక్కువ కోడ్ చేసిన వారికి టెండర్ ఖరారు చేశారు. ప్రచార వారోత్సవాలకు అవసరమైన వివిధ వస్తువులను సరఫరా చేసేందుకు ఈ టెండర్లు నిర్వహించారు. అలాగే ములుముడిలోని దేవస్థానం భూములకు రెండోసారి కౌలు వేలం నిర్వహించగా ఎవరూ ముందుకు రాలేదు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

జోరువానలోనూ విశేష స్పందన



కొడవలూరు : గుండాలమ్మపాళెంలో సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఖాదర్‌వలి

• జగనన్న ఆరోగ్య సురక్షకు పోటెత్తిన ప్రజలు

కొడవలూరు : జోరువానలోనూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి భారీగా జనం తరలిరావడం హర్షణీయమని అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి అన్నారు. మండలంలోని గుండాలమ్మపాళెంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైసా ఖర్చులేకుండా అందరికీ మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఆ విధంగానే సురక్ష కార్యక్రమాన్ని ప్రతిచోటా భారీగా సద్వినియోగం చేసుకుంటున్నట్లు చెప్పారు. గుండాలమ్మపాళెం చిన్న గ్రామమైనప్పటికీ భారీ వర్షంలోనూ 628 మంది సురక్ష శిబిరం ద్వారా వైద్య సేవలు పొందారన్నారు. జిల్లాలో నెల రోజుల పాటు జరిగిన ఆరోగ్య సురక్షకు ప్రతిచోటా అనూహ్య స్పందన లభించిందని తెలిపారు. ఎక్కడి శిబిరాన్ని పరిశీలించినా జనం బారులు తీరి కనిపిస్తున్నట్లు తెలియజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతంగా సాగిందనేందుకు ఇదే నిదర్శనమని చెప్పారు. ప్రతి శిబిరంలోనూ ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన శస్త్ర చికిత్సలు చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లి జేబులు ఖాళీ చేసుకునే అవకాశం లేకుండా ప్రభుత్వం ఇంటికే వైద్యులు వచ్చే బృహత్తర కార్యక్రమమైన ఆరోగ్య సురక్షను ప్రవేశ పెట్టడం ద్వారా ఎంతో మందికి మేలు జరిగిందని స్పష్టం చేశారు. శిబిరంలో వైద్య నిపుణులు రాజేష్‌రెడ్డి, సందీప్, శశికళ, పీహెచ్‌సీ వైద్యులు ఎం.రామకృష్ణ, కావ్య వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.వసంతకుమారి, ఈఓపీఆర్డీ డేవిడ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచ్ పెల్లేటి రజని, వైఎస్సార్‌సీపీ నాయకులు పెల్లేటి సతీష్‌రెడ్డి, నాగేంద్రప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అంకమరాణి, టి.సురేష్, రాధాకృష్ణ, జాలయ్య, శివ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విరువూరులో..

పొదలకూరు : మండలంలోని విరువూరు ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను సోమవారం నిర్వహించారు. మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు పర్యవేక్షణలో శిబిరాన్ని ఏర్పాటుచేశారు. హెల్ప్‌డెస్క్ ద్వారా క్యాంపునకు వచ్చిన రోగులను వలంటీర్లు, సిబ్బంది వైద్యనిపుణుల వద్దకు తీసుకెళ్లారు. ఇంటింటి సర్వేలో అందజేసిన టోకెన్ల ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరంలో కంటి పరీక్షలను కూడా నిర్వహించారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ శిబిరంలో పొదలకూరు సీహెచ్‌సీ వైద్యనిపుణులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పొదలకూరు : రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



పొదలకూరు : కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిస్ట్



కొడవలూరు : సురక్ష శిబిరంలో కేస్‌షీట్లను పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్‌ఓ

గిరిజనులకు అండగా ఉంటా



ఆర్థిక సాయం అందుకున్న గిరిజనులతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : నియోజకవర్గ పరిధిలోని గిరిజనులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. విడవలూరు మండలంలోని వరిణి గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 14 మంది గిరిజనులకు రూ.1.40 లక్షలను ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి నెల్లూరులోని ఆయన నివాసంలో సోమవారం అందజేశారు. ఆయన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు ద్వారా 14 మంది గిరిజనులకు ఇళ్ల నిర్మాణ, మరమ్మతుల కోసం రూ.10 వేల చొప్పున నగదును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ వరిణి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి రావడంతో ఆర్థిక సాయం అందజేశామని తెలిపారు. ఇంకా ఏమైనా సాయం కావాలంటే చేస్తానని భరోసా కల్పించారు. దీంతో వరిణి గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి, వరిణి సర్పంచ్ రావెళ్ల మల్లికార్జునరావు, వైఎస్సార్‌సీపీ నేతలు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఎందేటి భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

తోటపల్లిగూడూరు : మండల నూతన ఎంపీడీఓగా ప్రత్యూష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న హేమలత పదోన్నతిపై నుడా అకౌంట్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో ముత్తుకూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న ప్రత్యూష తోటపల్లిగూడూరు ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు. కాగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రత్యూష మాట్లాడుతూ మండలాధికారులు, ప్రభుత్వ సిబ్బంది, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రత్యూష

గ్రంథాలయ అభివృద్ధికి కృషి

మనుబోలు : మండల కేంద్రంలోని గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. మనుబోలు బస్టాండ్ సెంటర్‌లోని గ్రంథాలయాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుందని, వర్షం వస్తే ఉరుస్తోందని పాఠకుల నుంచి ఫిర్యాదులు రావడంతో పరిశీలించినట్లు తెలిపారు. ఈ గ్రంథాలయం చాలా ఏళ్ల క్రితం నిర్మించింది కావడంతో పెచ్చులూడి పడుతున్నాయని, చిన్న వర్షం కురిసినా ఉరుస్తుండడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రంథాలయాధికారి అరుణ్‌కుమార్ ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. ఈ సమస్యను జిల్లా గ్రంథాలయ సంస్థ దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయడమో, లేదంటే కొత్త భవనం నిర్మించేలా కృషి చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. వారి వెంట ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి శ్రావణి ఉన్నారు.



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

పోషకాహారంతో రక్తహీనతకు స్వస్తి

• ఏసీడీపీఓ అరుణ

కొడవలూరు : పోషకాహారంతో రక్తహీనత సమస్యలకు స్వస్తి చెప్పొచ్చని, అందుకే ప్రతిచోటా పోషక పదార్థాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు ఐసీడీఎస్ ఏసీడీపీఓ టి.అరుణ తెలిపారు. మండలంలోని గుండాలమ్మపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సందర్భంగా సోమవారం పోషక పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ప్రదర్శనలోని పోషకాహార పదార్థాలను పంపిణీ చేయడంతో పాటు గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు స్వయంగా తయారు చేసిన పోషక పదార్థాలను పంపిణీ చేయడం వల్ల తక్కువ ఖర్చుతో ఇంట్లోనే వీటిని తయారు చేసుకోవడంపై అవగాహన పెంపొందుతుందన్నారు. పోషక విలువలు లోపించినప్పుడే రక్తహీనత సమస్య తలెత్తుతుందని, ఆ సమస్యను కట్టడి చేయాలంటే పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారానే సాధ్యమన్నారు. అందువల్లే ప్రతిఒక్కరికీ పోషక విలువలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెల్లేటి రజని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల, పంచాయతీ కార్యదర్శి అంకమరాణి, టి.సురేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, సంపూర్ణ, శ్రావణి, మమత, సహాయకులు పాల్గొన్నారు.



సంపూర్ణ పోషణ కిట్‌ను అందజేస్తున్న ఏసీడీపీఓ, సర్పంచ్‌లు

తీర ప్రాంతంలో భారీ వర్షం

తోటపల్లిగూడూరు : బంగాళాఖాతంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో గత రెండు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై విడతల వారీగా భారీ వర్షం కురిసింది. దీనికి తోడు చలిగాలుల ప్రభావం కూడా తీవ్రంగా ఉంది. దీంతో కోడూరు తీరప్రాంతంలోని మత్స్యకారులు వేటకు స్వస్తి చెప్పి సామగ్రిని తీరంలోనే భద్రపరుచుకున్నారు. కాగా చాలా రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న మండల రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



తోటపల్లిగూడూరులో కురుస్తున్న భారీ వర్షం

ముగిసిన అథ్లెటిక్స్ పోటీలు



విజేతలకు బహుమతుల ప్రదానం

ముత్తుకూరు : కృష్ణపట్నం అదాని వరల్డ్ స్కూల్‌లో ఈనెల 26వ తేదీన ప్రారంభమైన సీబీఎస్ఈ క్లస్టర్స్–7 బాలుర అథ్లెటిక్స్ పోటీలు ముగిసిన సందర్భంగా సోమవారం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ, నాలుగు రోజుల పాటు జరిగిన ఈ పోటీలకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 79 పాఠశాలలకు చెందిన 800 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. రన్నింగ్ రేస్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, హైజంప్, లాంగ్‌జంప్‌లలో రసవత్తరమైన పోటీలు జరిగాయన్నారు. పోటీలు విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పారు.

నేడు బుచ్చిరెడ్డిపాళెంలో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం) : కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలో మంగళవారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు మల్లారెడ్డి సోమవారం తెలిపారు. స్థానిక పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద అమృత్ 2.0 పథకానికి సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారన్నారు.

నేడు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష

పొదలకూరు : మండలంలోని బిరదవోలు ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహిస్తామని పొదలకూరు కో–లొకేటెడ్ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ రిషిత సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని సచివాలయ పరిధిలోని గ్రామస్తులు హాజరై వైద్యపరీక్షలు చేయించుకోవాల్సిందిగా సూచించారు.

ముత్తుకూరులో..

ముత్తుకూరు : ముత్తుకూరు–3 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం జరుగుతుందని ఎంపీడీఓ ప్రత్యూష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జరిగే వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొంటారని, స్థానికులు వైద్య పరీక్షలు చేయించుకొని మందులు పొందవచ్చని తెలియజేశారు.

'జగనన్నకు చెబుదాం'లో వినతుల స్వీకరణ

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కె.వీరవసంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారు సోమవారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖకు సంబంధించి భూముల కొలతలు, భూ వివాదాలు, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ తదితర సమస్యలపై అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తమంగా రాణించాలి

కోవూరు : ఇంజినీరింగ్ చేస్తున్న ప్రతి విద్యార్థి వారి భవిష్యత్తుకు బంగారుబాట వేసుకుని ఉత్తమంగా రాణించాలని వక్తలు ఆకాంక్షించారు. మండలంలోని గంగవరంలో ఉన్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యావిధానంపై రూపొందించిన పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపల్ సందీప్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ఓఎస్, సీఎస్ విభాగాధిపతి టి.సాయిప్రసాద్‌రెడ్డి, సమన్వయకర్తలు ఎం.వెంకటేశ్వర్లు, చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

• వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటారుబైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద సోమవారం జరిగింది. నాయుడుపేటకు చెందిన షేక్.ఖాదర్‌బాషా పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి నాయుడుపేటకు వెళ్తుండగా కసుమూరు మలుపు రోడ్డు వద్ద ఆటో మోటారు బైక్‌ను ఢీకొనడంతో ఖాదర్‌బాషాకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం



అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న పవర్‌గ్రిడ్ ఉద్యోగులు

మనుబోలు : అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దామని అడిషనల్ ఎస్పీ కె.రాజేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కాగితాలపూరు రోడ్డు వద్ద ఉన్న 400 కేవీ పవర్‌గ్రిడ్‌లో అవినీతి నిర్మూలనపై ఉద్యోగులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని వివిధ వ్యవస్థల్లో పేరుకుపోయిన అవినీతి మూలంగా దేశ ప్రగతి కుంటుపడుతోందన్నారు. అన్నిరంగాల్లో పేరుకుపోయిన అవినీతికి అడ్డుకట్ట వేస్తేనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా అవినీతికి పాల్పడితే నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలియజేశారు. అవినీతి నిర్మూలనను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం ఉద్యోగులతో అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ జనరల్ మేనేజర్ సుధాకర్, డీజీఎం రాములు, చీఫ్ మేనేజర్లు దినేష్‌రెడ్డి, శ్రీకృష్ణ, హెచ్‌ఆర్ జితేంద్ర బెహరా తదితరులు పాల్గొన్నారు.

రెండో పంటపై స్పష్టత ఇవ్వాలి

కోవూరు : డెల్టా ప్రాంతంలో రెండో పంటకు నీటి విడుదలపై రైతులకు స్పష్టత ఇవ్వాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కలెక్టర్ ఎం.హరినారాయణన్ కోరారు. ఈ మేరకు నెల్లూరులోని కలెక్టరేట్‌లో సోమవారం ఆయన్ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమశిల జలాశయంలో 30.2 టీఎంసీల నీరు నిల్వ ఉందని, అందుకు సంబంధించి ఐఏబీ సమావేశం వెంటనే ఏర్పాటు చేసి డెల్టా రైతులకు రెండో పంట విషయమై స్పష్టత ఇవ్వాలన్నారు. ఆయన వెంట డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ నేత కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.



రైతుల సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

• కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట) : ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల లక్ష్యాల సాధనకు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల పురోగతి, నిర్దేశిత లక్ష్యాల సాధనకు చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై శాఖల వారీగా విభాగాధిపతులు రెండు వారాల ప్రణాళిక రూపొందించుకుని లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌కు ముందుగానే అజెండాలో తెలిపిన అంశాలపై ఖచ్చితమైన గణాంకాలను ఉన్నతాధికారులకు తెలియజేయాలలన్నారు. ప్రధానంగా అసైన్‌మెంట్ భూముల పంపిణీ, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీపై అవగాహన, యాప్ డౌన్‌లోడింగ్, ఆరోగ్యశ్రీ రెఫరల్ ఆస్పత్రులకు రోగులను పంపి చికిత్స అందించడం, జగనన్న సంపూర్ణ పోషణ, బాల్య వివాహాలు, వలంటీర్ల పోస్టుల భర్తీ, తదితర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు సంబంధించి లక్ష్యాలను అందుకునేందుకు పక్కాప్రణాళికతో పనిచేయాలని సూచించారు. జేసీ కూర్మనాథ్, డీఆర్డీఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, నాగరాజు, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఏడీఏ సుధాకర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

• ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్) : స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 140 మంది హాజరయ్యారు. తమ సమస్యలపై ఎస్పీకు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా ఆస్తి కోసం పిల్లలు వేధిస్తున్నారని, ప్రేమ పేరిట మోసం చేశారని, అత్తింటి వారు వేధింపులకు పాల్పడుతున్నారని, ఉద్యోగాల పేరిట మోసగించారని, దొంగతనం కేసుల్లో రికవరీ లేదని ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన ఎస్పీ ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల పోలీసు అధికారులను ఆదేశించారు. ఆస్తి కోసం తల్లిదండ్రులను వేధించడం, నిర్లక్ష్యం చేసే పిల్లలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. స్నేహపూర్వకంగా, పరిచయం. ప్రేమపేరిట వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని బెదిరించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జాబ్ కన్సల్టెన్సీల ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో, ఇతర శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నగదు చెల్లించి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డీ హిమవతి, ప్రసాద్, రూరల్ డీఎస్పీ పీ వీరాంజనేయరెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కే రామకృష్ణారెడ్డి, పీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.